# రగడ

పాలడుగు వెంకటేశ్వరరావు



నయనానంద కరమైన పచ్చని మామిడి గుబుర్లనుండి - చిగుర్లు మెక్కిన కోయిలలు 'కుహూ కుహూ' మని వూ ఇదిగా కూతలు పెడ్తున్నయ్. చూపు ఆనినంత మేరా, పచ్చని తివాచీ పరిచినట్లున్న వరి పొలాల మీదుగా రివ్వు రివ్వున చిరుగాలి వీస్తూ పయనం సాగిస్తున్నది. పంట కాలవల్లో నీరు వొడ్డుల్ని వొరుసుకుంటూ నిండుగా పారుతూ వుంది. చేతిలోని కర్రతో పోటు గొట్టుకుంటూ, రామయ్య చెరువు కట్టనెక్కి వూరుకి అభిముఖంగా సాగబారాడు, మెల్లగా.

తూరుపు తెల తెల్లవార్తూ వున్నది. ఉషోదయ ఉదయసంధ్యా సమయాన వూరికి మధ్యలో నిలబడి వున్న గుళ్ళోనుండి భక్తిగీతాలు వినవస్తున్నాయ్.

వూర్లోనుండి కలువు తీతకని గుంపులు గుంపులుగా జనాలు, పొలాల వయిపుగా, సాగిపోతా వున్నారు - గలగలా కబుర్లు చెప్పుకుంటూ. బళ్ళమీద ఎరువుల బస్తాలు వేసుకుని రయితులు పొలాలకి తోలుకుని పోతా వున్నారు. బరువుగా అడుగులు వేస్తావున్న ఎద్దుల మెడలలో గంటలు గణగణా మోగుతా వున్నయ్.



అకులాళ్ళ ఇళ్ళల్లోనుండి కోళ్ళు తోకలెత్తుకుని పరుగుల్దీస్తూ 'కుక్కురు కుక్కురు'మని అరుస్తా వున్నాయి. వాటిన్ని చూసి కుక్కలూ, తమ వంతు సందడి చేస్తా వున్నయ్.

ఎరువుల బస్తాని బుజాన కెత్తుకుని ఎదురుగా వచ్చాడు, కోటయ్య. అలుపు దీరటానికని ఎరువుల బస్తాని-గుడి పిట్టగోడ మీద దింపుకుని, ఎదురుగా వస్తా వున్న రామయ్యని ఎగాదిగా జూశాడు కోటయ్య, ముఖందుడుచుకుంటూ.

'వాన్నీ! అప్పుడే పొలంబోయి వస్తావున్నావా, రామయ్యన్నా! నీ 'ఇది' దొంగల్దోల! అసలు నీకు రాత్రుళ్ళు నిద్దర బట్టదేంటే?!'- అన్నాడు ఆశ్చర్యంగా.

'అవున్రా! కోటయ్యా! దాయెద్దుల్లాంటి నలుగురు కొడుకుల్ని చేతుల్లో బెట్టుకుని ఇంకా నీకెందుకురా ఈ బరువు పన్లూ?' అని రామయ్య అనేసరికి గలగలా నవ్వాడు కోటయ్య.

'ఏంట్రా ఆ నవ్వూ?! ఆఁ!'

'మూడుకాళ్ళ ముసలాడివి నీకే ఆ యావ పోలేదు. పైగా నా గురించి ఏదో అంటా వున్నావు. ఇదంతా ఏంటో మరి! అని నవ్వుతున్నాలేవే'

'అంటే! ఏంట్రా నీ మాటల కర్థం?'

'అవునుగాని-ఇంకా పొలాలూ తోటయీ అంటూ పగలనకా రాత్రనకా వాటిని బట్టుక తిరుగుతా వున్నావు. నాకు దెలవకడుగుతాను గానీ నీకెందుకే ఆ తాపత్రయం? అసలు! అది జెప్పు ముందూ'

'ఒరే! ఆ సంగతి ఇప్పుడు నేను నీకు చెపితే తెలవదు. కొన్నేళ్ళు పోయి నాక - నువ్వూ నాలాగా అయినాక గానీ-నీ యంతట నీవు మాత్రమే తెలుసు కోగలవు. 'ఇది' ఈనాటిది గాదురా. నేను పుట్టి బుద్ధెరిగినప్పటినుంచి, ఇదుగో-బ్రతికి బట్ట గట్టగలిగిన ఈ క్షణం వరకూ - ఇన్ని సంవత్సరాలుగా పెరిగిన సంబంధంరా ఇదీ! అటువంటిది ఈనాడు బుజాలమీద జరీకండవాలు వ్రేలాడవేసుకుని పెత్తనాలు చేస్తూ తీర్పులు చెప్పబోయే - మీ మునసబులాంటి కుర్రవాళ్ళ లక్ష మాటలు చెప్పనీ - అంత తేలికనుకుంటున్నావంట్రా?!-"

కోటయ్య చుట్ట ముట్టించుకోవటంలో మునిగి పోయాడు.

'ఎండనకా వాననకా - పగలనకా రాత్రనకా శ్రమపడి నా రక్తం ధార పోశ్నానా నేను! నీకు తెలవదులే. ఎంత చమట ఖర్చయిందో! ఎన్ని తడవలు కన్నీళ్ళు వాగులై పారాయో? ఒరే! ఈ పొలాలు నీళ్ళులేక ఎండిపోయి బిక్కమొహం పెట్టుకుని వున్నప్పుడు - చేతికి వచ్చిన పంట నాశనమయే పరిస్థితి ఎదురయినప్పుడు - గిలగిల్లాడి పసివెధవలాగా బావురుమని ఏడ్చాను. ఆ రోజుల్లో ఈ కాలవలు లేవు. ఈ నీళ్ళూ లేవు. వర్షాలు లేక చెరువు ఎండితే పొలాలు బీటలు వెయ్యాల్సిందే. ఇదంతా మొదట్లో ఎట్లా వుండేదనుకున్నావు? రాళ్ళూ రప్పలూ బండయీ తుప్పలూ పిచ్చిచెట్లూ, ఎత్తులూ వల్లాలూ. వీటిన్ని సరిజేసి ఈ పొలాల్ని పంట పొలాలుగా తయారుజెయ్యటం కన్న పని - ఎంత పనో ఈ కాలవు మనుషులకు తెలవదురా. రక్తం ధారపోసి కష్టపడ్డానురా. వీటిన్ని కన్నబిడ్డల్లాగా సాకానురా. ఒరే! కొన్ని సంవత్సరాలుపాటు ఏ ఫలసాయమూ లేకపోయినా — గోతికాడ నక్కల్లాగా—వీటిన్నే నమ్ముకుని కష్టపడి కనిపెట్టుకుని వున్నామురా. ఆ తర్వాత తర్వాతగాని, కాలం కర్మం కలిసి వచ్చి నవధాన్యాలూ, పళ్ళూ ఫలాలూ అందుతూ వుంటే ఆ సంతోషం పట్టలేక పొలికేకలు పెట్టూ పిచ్చి గంతులు వేసిన సందర్భాలూ - ఎన్నో!'-

'అవునే! ఇంతకీ ఆ మున్సబు ఏమంటాడూ?'

'ఏమంటాడు! వాడూ వీడూ ఒకటే! ఏ జాతి పక్షి ఆ జాతి పాట తప్ప మరొకటి ఎలాగ పాడుతుందీ?

'నేను గాదుగానీ - ఈ వూర్లో అందరూ అనుకోవటం ఏమిటంటే - ఆ ముసలాడి చాదస్తం గానీ — ఇంకా అతని కెందుకీ తాపత్రయం! ఇన్నాళ్ళూ కష్టజీవిగా బ్రతికాడు. కడుపు గట్టుకుని సంపాదించాడు. దానికి అంతు దరీ అనేది లేదు గదా. వున్నది ఒక్కగానొక్క కొడుకు. ఆడకూతుళ్ళు సుఖంగా పిల్లాపాపల్తో తమ దార్ని తాము వుంటున్నారు. ఇక అంతా ఆ కొడుక్కి అప్పగించి కృష్ణా రామా అంటూ కూర్చోక, లేకపోతే ఏ కాశికో పోక - కొడుకుతో గొడవలు బెట్టుకుని రగడలు కొని తెచ్చుకుంటాడూ?- నేనుగాదు ఈ మాటలన్నది నా మీద పడమాకు-'

రామయ్య రోషంగా అన్నాడు. 'ఒరే! ఆ మాట అన్నవాడ్ని స్టాంపు పేపర్లు కొని తెచ్చుకుంటే — దానిమీద రాసిస్తానని చెప్పు'

'ఏం రాసిస్తావు? చెప్పు వింటాను.'

'ఆ పెళ్ళాం మాట విని నెల రోజుల్లో 'వాడు' ఇదంతా తెగనమ్మి పారేసి బస్తీ ఎక్కి అంతా తగలేసి, అడుక్కుని దింటాడు.'

'నీ కోడలు గట్టి పట్టుదల మీదే వుందటగా?'

'వుండకేం జేస్తుంది? ఆడించినట్టల్లా ఆడే మొగుడు చేతిలో వుంటే అంతే మరి, సాగినమ్మ...ఎత్తివట్టుకొమ్మందంట! నీకు తెలవదా?'

నాకు దెలవకడుగుతాను — కొడుక్కి కోడలుకీ ఇవ్వక—ఇదంతా ఎవరికిస్తావయ్యా? పిత్రార్జితం వాళ్ళకిగాక ఎవరికి పోతుందీ?'

'ఇదంతా నా కష్టార్జితం. మా అమ్మ బాబులేం ఇవ్వలేదు నాకు'

'అయితే మాత్రం అది మాత్రం పిత్రార్జితం కాదా?'

రామయ్య కోపంతో వూగిపోతూ అన్నాడు—

'అవున్రా! పిత్రార్జితమే. అయితే దాన్ని తెగనమ్మి తగలెయ్యాలని ఎక్కడ రాసి వుందిరా? దానికోసం వూరూ వాడా అల్లరిచేసి పంచాయితీ పెట్టమని ఏ పెద్దమనిషి చెప్పాడ్రా? ఇది పద్ధతిగా వుందా నీకు? చెప్పు నువ్వే'

'నీ కొడుకు వ్యాపారం జేసి నష్టాల్లో మునిగి వున్నానని మొత్తుకుంటున్నాడట గదా. ఏదో కొంత పెట్టుబడి పెట్టి — ఆ గండం గడిస్తే మరలా ఆ వ్యాపారం బాగా వుంటుందని అంటున్నాడట గదా.'

'ఒరే. ఈ వ్యాపారాలూ గీపారాలూ మనలాటి వాళ్ళకటరా?. పులిని జూసి నక్క వాతలు బెట్టుకుంటే అది పులి అవుతుందా? మనిషి ముఖ్యంగా భూమిని నమ్ముకొనాలిరా. భూమి తల్లిలాంటిది. ఎప్పటికీ నమ్ముకున్న వాడి కడుపు గొట్టదు-అని నేను నెత్తీ నోరూ మొత్తుకుంటున్నాను. నా మాట అసలు ఎవరూ వినిపించుకోరేమ్రిటా? ఇనప్పెట్టిలాటి ఇల్లుంది. బంగారం పండే భూములున్నాయి. గొడ్లూ గోదా, తోటయీ, దొడ్లూ, వాములూ వున్నయి. అన్నీ ఈ క్షణం వాళ్ళ చేతుల్లో పెడతాను. కావాలంటే నేను పశువుల పాకలో కాలక్షేపం చేస్తాను. వాళ్ళని ఇక్కడికి వచ్చి, ఈ వూళ్ళో కాపురం పెట్టి, దర్జాగా కాలు మీద కాలు వేసుకుని కాలక్షేపం జెయ్యమను. అదే నేను కోరేది. వాళ్ళు నా మాట ఎందుకు వినిపించుకోరూ?. బంగారంలాటి పల్లెల్ని వదిలిపెట్టి బస్తీల్ని పట్టుకుని వ్రేలాడుతారు. ఏముందిరా అక్కడా?'

'నీ కోడలు బస్తీపిల్ల గదా! ఆవిడకి ఈ ఈగలూ, దోమలూ, ఈ మట్టి వాసనలూ పడవని అంటుందంట.'

'ఆవిడగారి కోసమని సెంటు సువాసనల్ని దెచ్చి గుమ్మరించమందాములే గాల్లోనుండి వూడిపడి వచ్చిందిగావును మరి'

'అయితే - ఇంత గొడవ జరిగినా - నీ పట్టు నీదేనంటావు నువ్వు.'

రామయ్య కనుకొలకుల్లో నీరూరింది. నోట మాటలేక శూన్యంలోకి చూస్తూ వుండిపోయాడు, ఎండిన పెదాల్ని నాలుకతో తడుపుకుంటూ.

'అన్నా! ఈ సంగతి నీకు దెలుసా? ఎంతగా జెప్పించినా నువ్వు మూర్ఖపు పట్టు విడిచి పెట్టడం లేదని — నీ కొడుకు — నీకు చెప్పించటానికిగాను - నీ

పెద్ద కూతుర్ని తీసుకు రావటానికి నిన్న ఆకునూరు వెళ్లాడట గదా! ఆ అమ్మాయి చెప్పితేగానీ నువ్వు దారికి రావని అంతా అనుకుంటా వున్నారు.'

రామయ్య చంపల మీదకి కన్నీరు జారింది. తప్పు తనదే అంటారేంటి?

'సర్లె. చాలా ఆలస్యమయింది. కాసేపయితే ఎండబడ్తుంది మరి. ఇక నేను వస్తా.' అని - ఎరువుల మూటని బుజానికెత్తుకుని కోటయ్య సాగిపోయాడు. రామయ్యని వదిలేసి.

గుడి ప్రహరీ గోడ ప్రక్కనే వున్న తాటాకుల పాకలో సందడిగా వుంది. కుర్రకారు వేడి వేడి టిఫెన్లు కొనుక్కుని దిని కాఫీలు త్రాగుతున్నారు. అది ముగించిన మరి కొందరు ఆ ప్రక్కన కూర్చుని సిగరెట్లు వూదుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు. కొందరు అప్పుడే పేకాటలో పడ్డారు. చెట్టుక్రింద. గుడివాడ నుండి బస్సు వచ్చే సమయం అయింది.

ఆ బస్సులో పేపరు వస్తుంది.

ఆ తర్వాత పేపరు తెచ్చిన వార్తలతో చాలాసేపు వాదులాడుకుని కాల క్షేపం చేసి భోజనాల వేళ అయి, ఆకళ్ళయి కడుపులు కర కర లాడగానే-ఇళ్ళ మొహాలు పట్టారు.

బస్సు వచ్చే వేళయిందనగానే - ఆ ప్రదేశమంతా సందడి సందడిగా అయింది.

నీరసంగా అన్పించి రామయ్య - పిట్టగోడమీద చాలసేపు కూర్చున్నాడు. రామయ్య మనస్సులో ఆలోచనలు సుడిగుండాల్లాగా గిరగిరా తిరుగుతున్నాయ్. గుండెల్లో అగ్నిపర్వతాల ఆవేదనలు ప్రేలుతున్నాయ్. అనుబంధాల లావా ప్రవాహాలు ఎగిరెగిరి పడుతున్నాయి.

శూన్య దృక్కులతో - వెర్రిపడిన మనస్సుతో - గాజు కనులతో - రేగిన గుండె గాయాల్తో - కనపడ్తూ వున్నదాన్ని గమనించకుండా, కనపడని వాటిని గురించిన వెదుకులాటలో, సతమతమయ్యాడు రామయ్య.

ఒక్కసారిగా ఆ ప్రదేశంలో సంచలనం రేగింది. 'పంపాం' అని గోల బెట్టూ బస్సు వచ్చి ఆగింది. దిగేవాళ్లు దిగుతూ వుండగా ఎక్కవలసిన వాళ్ళు హడావుడి పడ్తున్నారు, ఎక్కటానికి.

ఆ సందడికి ఆలోచనలు చెదిరిపోగా—

అటువయిపు చూశాడు రామయ్య నిర్లిప్తంగానే. గుండెలు ఝల్లుమన్నయ్.

మునసబు వెనకాల్నె రామయ్య కొడుకూ, ఆ వెనుక కోడలూ, ఆ తర్వాత పెద్ద కూతురూ, అల్లుడూ—బస్సు దిగుతున్నారు.

బస్సు దిగి వాళ్ళు-వూర్లోకి సాగిపోయారు. రామయ్య గుండెల్లో గునపాలు దింపినట్లయింది.

కోటయ్య చెప్పింది నిజమేనన్నమాట! తన మాటని కాకుండా చెయ్యటాన్కి, తన నవరంధ్రాల్నీ మూసేయటాన్కి, వాళ్ళు – తను నా అనుకున్న తనవాళ్లు – విశ్వప్రయత్నం చేస్తున్నారు అన్నమాట!

ఒక్కసారిగా నీరసం ఆవరించింది శరీరంలో.

నిస్త్రాణగా అనిపించింది నరాల్లో.

సమస్తం శూన్యంగా అయోమయంగా అన్పించింది రామయ్యకి.

చాలాసేపు అలాగే కూలబడిపోయి – ఆ తర్వాత మెల్లగా లేచి వచ్చిన దిక్కుగానే తిరిగి సాగిపోయాడు రామయ్య నెమ్మదిగా.

మామిడి గుబుర్ల నుండి. కోయిలలు 'కుహూ కుహూ' మని వూ ఇదిగా కూతలు పెట్తున్నయ్. చూపు ఆనినంత మేరా పచ్చని తివాచీ పరచినట్లున్న వరి పొలాల మీదుగా రివ్వు రివ్వున చిరుగాలి వీస్తూ పయనం సాగిస్తున్నది. పంట కాలవల్లో నీరు వొడ్డుల్ని వొరుసుకుంటూ నిండుగా పారుతూ వుంది. ఆ నీటిలో చేపలు ఎదురీతలు సాగిస్తూ వున్నయ్.

సూర్యుడు ఆకాశంలో ఒక బారెడు ఎత్తుకి ఎగబ్రాకాడు.

కాళీ ఎరువుల సంచిని భుజాన్న పెట్టుకుని, నోట్లో వున్న ముఖం వుల్లని నములుతూ, నాలుగు దిక్కులా పరికిస్తూ, ఇంటిముఖం పట్టి, గొల్లదాని గుబ్బలు అన్న పేరు గల ఆ దిబ్బల్ని ఎక్కి, దిగి – రామయ్యగారి మామిడితోట ప్రక్క నుండే బాటవెంట వస్తూ - గున్నమామిడి బోదె దగ్గర కూలబడి వున్న ఆకారాన్ని గమనించి దగ్గరగా వెళ్ళి పలకరించాడు – కోటయ్య.

'ఎవరయ్యా అక్కడా!?'

బాగా దగ్గరకు వెళ్ళి – అటు దిరిగి కూర్చుని వున్న ఆ ఆకారం బుజం పైన చేయివేసి కదిపాడు. 'ఏంటయ్యో! పెద్దమనిషీ! మాట్లాడవేం?' అంటూ.

ఆ ఆకారం ఆ కుదుపుకి నేలమీదకి ఒరిగిపోయింది.

మొహం అంతా కన్నీటితో తడిసి, అంతకు కొన్ని నిముషాల క్రిందటనే హంస ఆకాశంలోకి ఎగిరిపోగా, నిర్జీవమై వున్న ఆ శరీరపు మాజీ స్వంతదారు అయిన రామయ్యని గుర్తించి – కోటయ్య కెవ్వున ఒక్క పిచ్చికేక పెట్టాడు. ●




